చూసి నేను బుద్ధితెచ్చుకోవాలా ?" ఛీ! ఛీ! ఎంత మాటన్నాడు ?" కానీ ఏమిచేయగలడు ? ఆకోపమంతా ఇంటి దగ్గర రామూ మీద చూపించేవాడు.

తన చేతిక్రిందివాడు గనుక అడ్డమైన చాకిరీ చేయించుకునేవాడు.

—బూట్లకు పాలీషు వేయమనేవాడు—తనకుస్నానానికి నీళ్ళుపెట్టమనేవాడు—పైగా తిడుతుండేవాడు, కొడుతుండేవాడు. రాము అన్నింటికీ ఓర్పుకుని చెప్పిందల్లా చేసేవాడు—కొన్నికొన్నిసార్లు బాధగా తల్లితో చెప్పుకునేవాడు. గాని లక్ష్మమ్మ మాత్రం ఏమి చేయగలదు ? "అయ్యో! మన ఇంటిదగ్గర వున్నాబాగుండేది!" అని వాపోయేది—ఓదార్చేది! అంతకంటే ఆమె ఏమిచేయగలదు పాపం ? గిరి ఒక్కడేగాక అతని మిత్రులుగూడా రాముని నానామాటలనేవారు, నానా హింసలు పెట్టేవారు. వారు ఎన్నివిధాల హింసించినా ఓర్పుతో సహించేవాడు రాము.

శంకరంగారు రాముని కన్న కొడుకులా ప్రేమాభిమానంగా చూడ్డానికి ఒక బలమైన కారణంవుంది.

అదిఒక ఆదివారం. స్కూలు పిల్లలందరూ ఎక్స్‌కర్షన్‌కై ఆవూరి వెలుపల నున్న లాకులదగ్గరకు వచ్చారు.

(సశేషం)

★

# గొప్పలు చెప్పే గోపన్న

(పిల్లల పాట)

గొప్పలు చెప్పే గోపన్న!
ఏమి చేసెనో వినుమన్నా!!
మిత్రులనందరి తోలుకొని
అడివికెళ్ళను వేటకని.

జింకను చూచి పులి అని భయపడి
చెంగున గోపన్నెగిరాడు
పిక్కల బలమును చూపాడు
మిత్రులు హేళన చేశారు
బడాయి తగదని చెప్పారు.

—ఎర్రోజు సత్యం.

# : అగ్గిపుల్ల :

* రచన: శ్రీ యల్. రాజాగణేష్ *

★

టిక్......టక్......టక్......లయబద్ధమైనబూట్ల చప్పుడు తక్కున ఆగిపోయింది. అద్దంలో తననుతాను చూసుకుంటున్న కిశోర్‌కి తనకు బదులుగా ధనలక్ష్మి కనిపించింది. డబ్బు డబ్బు-డబ్బు. ఆశ్చర్యంగా, ఆనందంగా డబ్బుకేసి చాలాసేపు చూస్తూ ఉండిపోయాడు. అందమైన అమ్మాయి. ఆ అమ్మాయిపేరు ధనలక్ష్మి ఆ అమ్మాయి ఒంటిపై ఇరవై తులాల బంగారం, చేతుల్లో ఇరవై వేల నోట్లకట్టల కట్నం. ఆమె దూరమై పోతుందేమోనన్న భయంతో పట్టుకోవాలని చూశాడు తను ఆత్రంగా. కానీ అద్దం మాత్రమే తన చేతికి తగిలింది అంతే. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ నవ్వుకున్నాడు. నవ్వినవ్వి-నువ్వెక్కడికి పోతావ్ లే గొణుక్కున్నాడు మళ్ళీమళ్ళీ నవ్వుకున్నాడు కిశోర్.

అద్దంలో తననుతాను చూసుకుంటున్న అరవిందకు తనకు బదులుగా కిశోర్ కనిపించాడు. ఇంకా ఇంకా అతనే కనిపిస్తుంటే ఆశ్చర్యంగా ఆనందంగా అలా చూస్తు ఉండిపోయిందామె చాలాసేపు.

అదే చూపు, అదేనవ్వుముఖం ఇద్దరి మధ్యానిలిచిన మౌనంలో ఎంతాలోచించినా అర్థంకాని మూగభాష. ఏవేవో మూగ బాసలు మైమరపు ఆదమరపు అంతే. అతను కరిగి

ముద్దైపోతున్నాడు. అందనంత దూరదూరంగా పోతున్నాడు, కళ్ళు నులుముకుని చూసింది తను. అతణ్ణిగట్టిగా పట్టుకోవాలనుకుంది తను. కానీ అద్దంమాత్రమే అరవింద చేతికి తగిలింది. ముసి ముసినవ్వులు నవ్వుకుని 'కిశోర్ పైనే నా ద్యా సంతానూ...' అని లోలోనే గొణుక్కుంది. మత్తుగా కళ్ళుమూసుకుంది. మూసుకపోయిన కళ్ళు పగటికలలు కంటుంటే వాస్తవం సర్వం మరిచిపోయి విశాలమైన ఆశాసౌధాల్లోకి పరు గెత్తింది అరవింద.

చాలాసేపటి తర్వాత అరవిందని తట్టి పిల్చిందో కంఠం.

"అరవిందా! ఏయ్......పిచ్చీ...... నిన్నే!" మళ్ళీ అదేపిలుపు.

త్రుళ్ళిపడి అటుచూసిన అరవింద –

"ఓహ్! విజయా! నువ్వా?" అంది పిసరంత తడబాటుతో.

"పెళ్ళికొడుకేవంటున్నాడో? ...చూస్తుంటే పగటి కలల్లో కొలువు తీరినంత వరకూ వచ్చినట్టున్నాడే!" నిజాన్ని కనిపెట్టేసిన విజయ చిలిపి చూపుల్తో గుచ్చిగుచ్చి చూస్తు కొంటెగా అడిగింది.


"ఛీ పోదు అదేం కాదు" నిజాన్ని కనిపెట్టేసిందని ఒప్పుకోకుండా త్రుంచేసినట్టు వెంటనే చెప్పింది అరవింద.

"అయితే మంచిదే!" అని కాస్సే పాగింది విజయ.

మళ్ళీ తనే–"నీకు తెల్సా ఈవిషయం?" అంది.

ఏవిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది అరవింద.

"మొన్న నిన్ను చూడ్డానికి వచ్చాడే... అతనిపేరు కిశోర్ కదూ? అతనికే మన ధనలక్ష్మికీ పెళ్ళికుదిరిందట తెల్సా? ధనలక్ష్మంటే...ఎవరనుకున్నావ్? అదే మనతోకల్సి చదూకుందేం, అదే! కట్నం ఇరవై వేలట. ఇరవైతులాల బంగారంట అందుకు తగ్గట్టూ లాంఛనాలట......" ఇంకా ఏవేవో చెప్తూనే ఉందామె.



రవిరాజ్ ఇంటర్ నేషనల్
వారి
"అనసూయ"
చిత్రంలో
సులిభదేశ్ పాండే, వాణిశ్రీ
స్మితాపాటిల్

ఆపై మాటలేవీ మరి వినపడ్లేదు అరవిందకి. తన మనో భావాలు ముఖంలోకి చొరనీకుండా ఉంచలేక ముఖం వాల్చేసుకుంది తను. ఎన్నో సందేహాల్తో ఏవేవో అడగాలనిపించినా ఏమీ అడగనూ లేదు. కనీసం పెదిమైనా కదపనూ లేదు. మౌనం వహించిన ఆమె మనోపథం ఈర్ష్యా, అసూయా, ద్వేషం, అసహనం పరిపాలించాయి.

ఇంకా ఏవేవో చెప్తూనే ఉంది విజయ.

"అబ్బా! ఏవిటి విజయా నీ సోది. ఎవరెలా పోతే మనకేం. ఏదెలా పోతే మనకేం. చెప్పే ఓపిక నీకున్నా వినే ఓపిక నాకు లేదు. ఆ విషయమ్ము తప్పించి మరేదేనా చెప్పు" అంది అరవింద.

అంతే విజయనోరు మూతపడి పోయింది. మళ్ళీ మరోక్షణంలోనే అరవింద మాటల్ని పట్టించుకోకుండా -

"పదివేలు కట్నంతో అతనికీ, నీకూ పెళ్లి కుదిరింది కదూ? అయినా ఇంతలోనే ఏమైందే?" అతి సౌమ్యంగా ప్రశ్నించిందీ సారి విజయ.

"అయిదు వేలు కట్నమిస్తామని ఒకరూ, ఇరవై వేలు కట్నమిస్తామని మరొకరూ, లక్షలు లక్షలు కుమ్మరిస్తామని ఇంకొకరూ ఎగబడే తల్లి తండ్రులున్నంత వరకూ ఆడపిల్లల గతి ఇంతే. స్త్రీపట్ల ఈ వ్యవస్థ ఇంతే. తనకాబోయే జీవిత భాగస్వామికి ఒక ఆశా - ఆశయం, అభిరుచీ - అభిమానం, గుర్తింపూ - గౌరవం ఉంటుందని గ్రహించేశక్తి మగవాళ్ళలో రానంత వరకూ. వివాహవ్యవస్థా దాని పర్యవసానమూ ఇంతే. ఇటు తల్లిదండ్రులూ, అటు పెళ్ళికొడుకులూ ఇంతే ఇంతే ఇంతే" అని తీవ్రంగా పలికి తక్కువ ఆగిపోయింది అరవింద. తన మాటలు తనకే కొత్తగా వినిపించాయి తన ధోరణి తనకే అసవ్యస్తంగా, అభాసుపాలుగా స్ఫురించింది. మళ్ళీతనే-

"ప్లీజ్ విజయా! నన్నాట్టే మాట్టాడించకు" తక్కువస్వరంతో ముక్తసరిగా అని మౌనం వహించింది అరవింద. మరేదో అనాలనుకున్న విజయ తన అభిప్రాయాన్ని మార్చేసుకుని వెను తిరిగి వెళ్ళిపోయింది.

ఒంటరిగా మిగిలిపోయిన అరవింద అద్దం ముందు నిలుచుంది. అద్దంలో తన ప్రతిబింబానికి బదులుగా కిశోర్ కనిపించలేదు. బహూశా ఇక కనిపించదు కూడా. అసవ్యస్తంగా ఉన్న వాస్తవం అరవిందను కలవర పెడ్తుంటే ఆశలూ ఊహలూ దరిచేరే సాహసం చెయ్యలేక పోయాయి.

ఔను! ఆశాసౌధాలూ ఊహాలోకాలూ వాస్తవానికి అగ్గిపెట్టెల్లా అతి ఇరుకు. ఊహల్లో ఊరేగే వాళ్ళు అగ్గిపుల్లలు. అరవింద వీధిలోకి నడిచింది.

సర్వప్రపంచం నిశినిండింది. వీధి విరహం అనుభవిస్తోంది.

---


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 40 పైసలు

సంవత్సర చందా ... రూ. 7-50.

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాల్సులో దొరుకును.